# ఎబ్బెబ్బె ఏంమగాళ్ళో ఏమో!



ఎందరో వచ్చే పార్కులో, ఎవ్వరూరాని మూలకిచేరి, సిమెంటు బెంచీమీదకి జారి, ఏదో ఒక పుస్తకంలోకి కళ్ళూ, బుర్ర దూర్చేసి కూచున్నాను. "ఎల్" వచ్చింది...గమనించలేదు.

"ఎస్ ! యీ వసంతం ఎంత సరదాగా వుందో యింత సరదాలో నిన్ను ఒకమాట అడగాలనుకుంటున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు... అవునా ?" అని రెండుసార్లు అడిగి, మూడోసారి చెప్పమన్నట్టు చూచిందికాబోలు. నాలుగోసారి నన్ను కదిపి కుదిపి మరీ అడిగింది.

"ఊఁ" అన్నాను.

'ఎల్' నా తలదగ్గర కూర్చుని తలలోకి వేళ్ళు దూర్చి, జుట్టుని అటూ యిటూ దువ్వుతూ... "ఓహ్...ఆ మాట ఎంత ఆనందంగా వుంది... ఈ ప్రపంచంలోకల్లా నేను ఎంతో అదృష్టవంత స్త్రీని. అలాంటి స్త్రీని ప్రేమించటం నీ అదృష్టం" అని అన్నది. "కాదూ?" అంటూ నా తల అటూ యిటూ తానే ఊగించింది.

"ఊఁ" అన్నాను మళ్ళీ.

"అబ్బ...ఆ "ఊఁ" లోనే మన జీవితం ఇమిడి వుంది" అన్నది, నన్ను ఆనుకుని కూర్చుని తెచ్చుకున్న చిన్న అద్దంలో ముఖం చూచుకుంటూ.

"ఏమిటా పుస్తకం ? అప్పట్నుంచి నేను రాత్రింబవళ్ళు తెగ ఆలోచిస్తున్నాను. ఈ సారి క్లాసులో ఫస్టు వస్తే...అప్పుడు నీవు ఎగురుకుంటూ పరుగు పెత్తుకుంటూ నాకు ప్రెజెంట్ చేసుకొస్తావు ... కానా ... వద్దుబాబూ ... నాకు సిగ్గేస్తుంది ... యిదుగో ఎస్ !" అంటూ గడ్డంపట్టి పుస్తకం మీదినుంచి నా ముఖాన్ని తనవేపుకు తిప్పింది. నేను ఫస్టున వస్తానంటే నీకు నమ్మకం లేదు గదూ...నేను రాలేదంటే దానికి నువ్వే కారణం, నేను పుస్తకం పుచ్చుకుంటే చాలు. నువ్వే జ్ఞాపకం వస్తున్నావు...అప్పుడల్లా నేను ఏమి ఆలోచిస్తుంటానో తెలుసా? పెళ్ళయ్యాక మనం కాపురముండబోయే యిల్లూ, పిల్లలు, ఫర్నిచరూ, పిల్లల అవసరాలూ అన్నీ యిప్పట్నుంచే ఊహిస్తుంటాను ... డియర్, నువ్వేమి ఊహిస్తుంటావ్...చెప్పవూ... చెప్పు ఎస్ !... నా బుగ్గలూ, పెదాలూ, అవితప్ప నీకేమి ఆలోచనకిరావు...వద్దు వద్దు ... అలాంటివేం చెప్పక సిగ్గుతో చచ్చిపోతాను ... ఏం?" అంటూ పుస్తకం లాగింది.

"ఉహూఁ" అన్నాను.

పుస్తకం యిచ్చేసింది ... "కన్నుమూస్తే కలలో నువ్వే...ఫలానా చీరకట్టుకో అంటావట... దానికి తగ్గ జాకెట్ యిస్తావట...ఛీ ఛీ ... ఏమిటి యిలా సిగ్గువిడిచి మాట్లాడుతున్నాను. ఛీ ఛీ... నువ్వు ఒక్కమాట కూడా మాట్లాడవు. అయితేనేం ... నీ చూపుల్లో, నీ నవ్వుల్లో, నీ మౌనంలో నేను అంతా అర్థంచేసుకుంటాను ...నువ్వో ...ఏం ఎస్ ?..."

ఎల్ కి విసుగుపుట్టినట్టుంది. పుస్తకం లాగి క్రింద పారేసి చివ్వున లేచి, దూరంగా చూచి "అదిగో విజ్జీ" అంటూ వెళ్ళిపోయింది.

ఇక చదువు సాగదనుకుని, ఎంత బాగా సాగిందో అనుకుని పుస్తకం తీసుకుని ఆ పక్క పొదచాటుకు పోదాం అనుకున్నాను...పుస్తకంలో రెండు కటింగుల కోసం వెతుకుతున్నాను.

ఎల్, విజ్జీ...ఈ మొదటి పొదపక్కనే చేరారు. యిందాకటి నా అవస్థ యిప్పుడు విజ్జీకి పట్టింది... ఈ కొత్తదంతయ్య యింకేం మాట్లాడనివ్వటం లేదు ఎల్...

"కాదు విజి ..అతను మాట్లాడుతున్నంత సేపూ నీతో వచ్చేసేయా అనుకో. నువ్వు కనిపించావు కనుక, నిన్ను చూపించి యిలా పారిపోయివచ్చాను. ఎస్, ను ఈ వసంతం సరదాగా వుందట ... నన్ను పట్టుకుని ప్రేమిస్తున్నావని ఒక్క మాట చెప్పమంటాడు. అలాంటి స్త్రీ తనని ప్రేమించడం అతని అదృష్టమట ... క్లాసులోకల్లా నేను ఫస్టున రావాలని తాను మొక్కుకున్నాడట. తానెటూ పాస్ కాడట. పుస్తకం తెరిస్తే నేనే కనిపిస్తున్నానట... పెళ్ళయ్యాక వుండబోయే యిల్లూ, పుట్టబోయే పిల్లలూ...అన్నీ తలచుకుంటూ యిప్పటినుంచి అవే కలలటా... అబ్బబ్బ .... నా బుగ్గలు, నా పెదాలు, నా పెదవులు, ఛీ ఛీ ... నా కాలి గోటినుంచి జుట్టు చివరిదాకా ఒకటే వర్ణించటం... ఇట్లాంటి బోరు కొట్టించే వాడితో ... నాకా విసుగు... ఎబ్బెబ్బె ...ఏం మగాళ్ళో ఏమో ... యింత సిగ్గు విడిచి ఎలా మాట్లాడతారే...! విజ్జీ...మీ ఆయనా అంతేనా ?" అని అడిగింది...

విజ్జి మాట్లాడలేదు...కోపంతో ఆమెది బరువుగా ఊపిరి తీసుకోవటం మాత్రం వినిపించింది...అంతే...

"విజ్జ విజ్జీ మీ ఆయన యిటే వస్తున్నాడే ... నేను వెళ్తున్నా. యీ మనిషి అంటేనే నాకు బోర్" అంటూ ఎల్ పారిపోయింది.

విజ్జీ మొగుడు వస్తాడు ... ఎందుకూ మరు వున్నాం. ఎల్ కి యింకా పెళ్ళికాలేదు. దాని ప్రియుడు చూడు, ఎన్ని మాటలు మాట్లాడాడో. అంటూ ఎల్ చెప్పినవన్నీ తిరిగి అప్పగించింది... విజ్జీ మొగుడు విరగబడి నవ్వేడు ... 'వాడా? ఎస్ గాడు...వాడు మాట్లాడాడా, ఇవిడే ఏదేనా పుస్తకంలో చదివింది నీకు అప్పగించిందా?" అన్నాడు.

"ఎబ్బెబ్బె...ఏం మగాళ్ళో ఏమో ... అది వదులంటే అతగాడు మాట్లాడి మాట్లాడి విసుగ పుట్టిస్తాడు...మీరేమో ... ఒక్కమాట మాట్లాడరన్నా మాట్లాడరు...నేను నా స్నేహితుల్తో చెప్పుకోటానికి ఒక్కటికూడా వుండదాయె" అన్నది విజ్జీ ఏడుపు వచ్చినట్టు...

"ఓహో...అదా సంగతి...నేను యిల్లాంటి క్యారెక్టర్లతో ఒక పెద్ద నవల వ్రాయబోతున్నాను." అన్నాడు అతను.

"ఆఁ నిజం...? ప్రతిసారీ దాని ఎస్ ఏదో పెద్ద మాటకారి అయినట్టూ నా మొగుడు కేమీ చేతగానట్టు చెప్పిపోతుంది .. యిప్పుడే పోయి మీరు సంవత్సరాల తరబడి తరగని సీరియల్ వ్రాస్తున్నారని చెప్పి దాని నోరు మూయించేస్తాను" అంటూ విజ్జీ పరుగు తీసింది...ఎల్ ని వెతుక్కుంటూ ..

ఒక చిన్న క్షమాపణ, గమనిక : యిది చదివి ఎవ్వరూ ఏమీ అనుకోనక్కర్లేదు. పెళ్ళి కాక ముందు సంగతి యిది. యిన్నాళ్ళతర్వాత యిది నిజంగా జరిగిందో, లేక నేను ఏదేనా పుస్తకంలో చదివానో, లేక ఎవరేనా చెప్పారో, నాకు జ్ఞాపకం లేదు.

నీతి : నిజంచెప్పి బాధపడటం మగాళ్ళకి మంచిదికాదు.
ఇంటిలోన పోరు ఇంతింతగాదయా అని వేమన పద్యం లోలోపల చదువుకోటం యింటికీ వంటికీ ఆరోగ్యం...

— శివరాం.

# పద్యంకాని పద్యం

ఆరుద్ర

నినాదాలు మతం కాదు
నీతిలోన హితం లేదు
నీ కోసం నా కోసం
నేతలు చెప్పే మాటలు
నిన్నా నేడూ రేపూ
అన్నా ! అన్నన్నా !
వాళ్ళే అనుసరించరు !

నువ్వూ నేనూ చస్తే
నవ్వుకొనేదీ, నవ్వేదీ ఎవ్వరు...?
నిన్నూ నన్నూ పురిగొల్పే
నేతలు మాత్రమే !
పాతవి చివికిన నీతులు,
ఈ తరన్ని కాపాడవు
నూతన సంకేతాలను
తాతలు గుర్తించలేరు !
నువ్వూ నేనూ వ్రాస్తే
పువ్వుల చరిత్రలో ముళ్ళుండవు
... ంకవు

నిన్నూ నన్నూ రాయనివ్వరు
నిజం పేననివ్వరు, నేయ నివ్వరు
నిజం నేతకు శత్రువు.